క్లుప్తంగా

'మహిళాభివృద్ధిని విస్మరిస్తున్న బీజేపీ'



బాపట్ల అర్బన్: బీజేపీ పాలనకు వ్యతిరేకంగా పోరాడదామని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శీలం ఏసమ్మ పిలుపునిచ్చారు. శుక్రవారం బాపట్ల అంబేడ్కర్ భవన్‌లో అంతర్జాతీయ శ్రామిక మహిళ పోరాట దినోత్సవం నిర్వహించారు. బాపట్ల మండల కార్యవర్గం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కార్యదర్శి ముచ్చల పల్లవి అధ్యక్షత వహించారు. ఏసమ్మ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ఆటంకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షురాలు జె.కల్పన మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న మహిళా చట్టాలు అమలు కాకుండా ప్రభుత్వం కుట్రపన్నుతోందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కోశాధికారి డి.రాములమ్మ, బాపట్ల మండల అధ్యక్షురాలు కొండ అన్నమ్మ, సభ్యులు లక్ష్మి, పట్టణ కార్యదర్శి జి.మరియమ్మ పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని చెన్నకేశవ స్వామి హుండీ ఆదాయాన్ని శుక్రవారం భక్తుల సమక్షంలో లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ 19 నెలల కాలానికి రూ.20,150 ఆదాయం లభించినట్లు వివరించారు. లింగోద్భవస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.50,098 లభించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ బాపట్ల డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్యామల తదితరులు ఉన్నారు.

వేలంపాట వాయిదా

చందోలు బండ్లమ్మ ఆలయంలో ఫ్లవర్ డెకరేషన్, సప్లై కంపెనీ సామాన్లు అద్దెకిచ్చు హక్కు కోసం శుక్రవారం నిర్వహించాల్సిన బహిరంగ వేలం అనివార్య కారణాల వల్ల ఈనెల 24వ తేదీకి వాయిదా పడినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

చందోలులో హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయంలో ప్రతి శుక్రవారం పెళ్లికాని మగపిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరిగేందుకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

బాపట్ల: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏపీ జేఏసీ, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.హెచ్.సురేష్‌బాబు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బి.సుశీల, డి.అర్జున్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు ఒ.మహబూబ్‌బాషా, ఎ.సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో..

వేమూరు: వేమూరు తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు కె.రాజా రమేష్ మోహన్ తహసీల్దార్ ఎం.ఎస్.శ్రావణ కుమార్, డిప్యూటీ తహశీల్దారు నాగరాజు, ఆర్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

13న మండలంలోని అభివృద్ధి అంశాలపై సమీక్ష

రేపల్లె రూరల్: పట్టణంలోని రామకోటిపేటలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో ఈనెల 13న రేపల్లె మండలంలోని గృహసారథులు, కన్వీనర్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి అంశాలపై రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అధ్యక్షతన సమీక్ష నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కనుల పండగ

- వైఎస్సార్ కంటి వెలుగు.. పేదలకు వరం
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో పరీక్షలు
- వెల్లువెత్తుతున్న ఆనందం





వెల్లటూరు పీహెచ్‌సీలో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు అరుణరాణి

భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ కంటి వెలుగు పథకం దిగ్విజయంగా కొనసాగుతోంది. వృద్ధులు, విద్యార్థులు, పేదల కన్నుల్లో పండగ కాంతులు వెదజల్లుతోంది. ఈ పథకం ద్వారా వైద్యపరీక్షలతోపాటు అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తుండడంతో సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది.

వృద్ధులకు వరం

వైఎస్సార్ కంటి వెలుగు పథకం ముఖ్యంగా వృద్ధులకు వరంగా మారుతోంది. ఈ పథకం ద్వారా 60 ఏళ్లు పైబడిన అవ్వాతాతలకు నిరంతరాయంగా సేవలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు భట్టిప్రోలు మండలంలో 5,167 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించగా 3,119 మందికి కళ్లజోళ్లు అవసరమైనట్లు గుర్తించారు. 2,874 మందికి కళ్లజోళ్లు అందించారు. 325 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించగా, 300 మందికి ఆపరేషన్లు చేయించారు.

తొలివిడతలో పాఠశాలల్లో..

కంటి వెలుగు పథకంలో భాగంగా తొలి విడతగా గతంలో బాలలకు పరీక్షలు నిర్వహించారు. పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేశారు. ప్రతి విద్యార్థికీ పరీక్షలు చేసి అవసరమైన వారికి చికిత్స అందించారు. ఉచితంగా మందులు, కళ్లజోళ్లూ అందించారు. ఐదేళ్లుపైబడిన అందరికీ కంటివైద్యం అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

వైద్య పరీక్షలు నిరంతర ప్రక్రియ



కంటి వైద్య పరీక్షలను నిరంతర ప్రక్రియగా అన్ని చోట్లా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక మండలం పూర్తయ్యాక మరొక మండలంలో నేత్ర పరీక్షలను నిర్వహిస్తున్నాం. మలి వయసులో కంటి చూపును ప్రసాదిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అవ్వాతాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారి కళ్లలో కాంతులు కనిపిస్తున్నాయి.

– పి.అరుణరాణి, వైఎస్సార్ కంటి వెలుగు పీఎంఓఏ

గ్రామాల్లోనే కంటి వైద్య సేవలు



వృద్ధులు, పిల్లల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఎంతో మందికి గ్రామాల్లోనే వైద్య సేవలు అందిస్తున్నాం. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందిస్తున్నాం. ఆపరేషన్లు కూడా చేయిస్తున్నాం.

– చావలి రామలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, వెల్లటూరు

గడప గడపకు సంక్షేమం

- అదే ప్రభుత్వ లక్ష్యం
- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. మూడేళ్లలో ప్రతి గడపా పొందిన పథకాల లబ్ధి గురించి చెబుతూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి, మునీర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు, ఎంపీపీ షేక్ బాజి, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, ఎంపీటీసీ సభ్యులు కరీమున్నీసా, చల్లాపల్లి విజయరాజు, గ్రామ ఉపసర్పంచ్ చేబ్రోలు వీరయ్య, గోవతోటి విజయ్, పార్టీ రాష్ట్ర నాయకులు మండే విజయ్‌కుమార్, చేబ్రోలు రవికుమార్, శ్యామల నాగిరెడ్డి, పార్టీ బాపట్ల జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, దబ్బుకూటి మాధవరావు, కూసంపూడి దేవేంద్రరాజు, కుంతం ప్రసన్నరాజు, యేహాను, గుమ్మడి సీతయ్య, ఎంపీడీఓ కొల్లిపర పద్మజ, గ్రామ కార్యదర్శి శేషగిరారావు, పంచాయతీరాజ్ ఏఈ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఘనస్వాగతం

బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి గ్రామస్తులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. గ్రామ శివారులోనే పూలదండ వేసి దుశ్శాలువా కప్పి సత్కరించారు. రహదారి వెంట అడుగడుగునా పూల వర్షం కురిపించారు. గ్రామంలోని యువకులు బాణసంచా కాలుస్తూ జై కోన అంటూ నినాదాలు చేశారు. దీంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

కర్లపాలెం ఆర్ఐగా రాజేంద్రప్రసాద్



కర్లపాలెం: కర్లపాలెం ఆర్ఐగా రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాజేంద్రప్రసాద్ ఇప్పటివరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టైపిస్టుగా విధులు నిర్వహించారు. ఇప్పుడు పదోన్నతి రావటంతో ఆర్ఐగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాజేంద్రప్రసాద్‌కు తహసీల్దార్ కేశవనారాయణరావు, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ మృతి



చంద్ర పాల్

తురుమెళ్ల(వేమూరు): అమృతలూరు మండలం తురుమెళ్ల గ్రామానికి చెందిన ప్రముఖ హేతువాది, అంబేడ్కర్‌వాది ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజరు జిన్నా బొత్తుని బిపిన్ చంద్రపాల్ (68) అనారోగ్యంతో హైదరాబాద్ కిమ్స్ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. శుక్రవారం సాయంత్రం ఆయన మృతదేహాన్ని తురుమెళ్లకు తీసుకొచ్చారు, పలువురు ప్రముఖులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తురుమెళ్ల గ్రామానికి ఆయన చేసిన సేవలను స్మరించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ హేతువాది ముక్కాల రాజేంద్ర ప్రసాద్, ముక్కాల కిరణ్ బాబు, గిరి బేతాళ బాబురావు, కోళ్లపూడి అశోక్ కుమార్, ముక్కాల సాల్మన్, పేర్ల సుబ్బారావు, అంబేడ్కర్ యూత్ సభ్యులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా అందించాలి



నగరం: నులి పురుగుల నివారణ కోసం 19ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా అందించాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఈ నెల 14న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో మాత్రలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాధా రమణ, ధూళిపూడి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ షేక్ నజీలా పర్వీన్, సీహెచ్‌వో బాబు రావు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆదర్శ మహిళ



సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



అమర్తలూరులో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

బాపట్ల అర్బన్: బాపట్ల మండల కార్యాలయం ఆవరణలోని పూలే దంపతుల విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి బీటీఏ రాష్ట్ర నాయకులు గడ్డం ఏలియా అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు చదువు ముఖ్యమని తెలిపిన ఆదర్శ వనిత సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ బాపట్ల అసెంబ్లీ ఇన్‌చార్జి కె.వినయ్ రాజు, ప్రముఖ న్యాయవాది కట్ట కోర్నిల్, దాసరి లక్ష్మి, గుంటూరు సురేష్, నత్తల ప్రసాద్, యశ్వంత్, సాయి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

అమర్తలూరులో..

అమర్తలూరు(వేమూరు): చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని గ్రామ సర్పంచ్ దేవరకొండ రాము చెప్పారు. అమర్తలూరులోని గ్రామ సచివాలయం వద్ద సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.అనిల్ కుమార్, బి.తిరుమలరావు పాల్గొన్నారు.

మార్చి 31 నాటికి పనులు పూర్తి చేయాలి

డీఈ కృష్ణారెడ్డి



ప్రాతూరులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంటీఎంసీ డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లి రూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని డీఈ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరు, కొలనుకొండ, వడ్డేశ్వరం, ఉండవల్లి, పెనుమాక, ఆత్మకూరు, నవులూరు, తదితర ప్రాంతాల్లో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, జరుగుతున్న పనులను గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతి రోజూ పరిశీలించి నివేదిక అందజేయాలని చెప్పారు. దాదాపుగా ఈనెల 1వ తేదీ నుంచి 14,15వ ఆర్థిక సంఘం నిధులతో 35 అభివృద్ధి పనులు చేపట్టగా ఇప్పటికే 12 పనులను పూర్తి చేశామని, మిగిలిన అభివృద్ధి పనులు కూడా మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేసేలా అన్ని చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కిషోర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ స్థల పరిశీలన...

తాడేపల్లి రూరల్ పరిధిలోని ఏఐబీ సంస్థ 75 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న వాటర్ ప్లాంట్‌ను ఉండవల్లిలో నిర్మించనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏఐబీ ప్రతినిధులతో నగరపాలక సంస్థ అధికారులు కలసి ఉండవల్లిలో దేవదాయ శాఖ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేషన్ వ్యాప్తంగా కృష్ణాజలాలను అందించేందుకు ఏఐబీ బ్యాంక్ సహకారంతో పైపులైన్ నిర్మాణం చేపట్టామని, కృష్ణానది నుంచి రావాటర్ తీసుకుని ఫిల్టర్ చేసేందుకు ఐదెకరాల స్థలం కావాల్సి ఉందన్నారు. అందుకు అవసరమైన స్థలం కృష్ణానదికి అతి సమీపంలో ఉన్న ఉండవల్లిలో పరిశీలించామని, ఈ స్థలాన్ని కార్పొరేషన్‌కు తాగునీటిని అందించేందుకు, అవసరమైన నిర్మాణాలు చేపట్టేందుకు అనుకూలంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈలు కృష్ణారెడ్డి, రషీద్, ఏఈలు ప్రవీణ్, కిషోర్ పాల్గొన్నారు.

భూసారం పెంపునకు చర్యలు చేపట్టండి



పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని పిట్టలవానిపాలెం గ్రామ సర్పంచ్ బొలగాని అరుణకుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుబ్బారావు చెప్పారు. మండలంలోని పిట్టలవానిపాలెం గ్రామంలో శుక్రవారం సుస్థిర సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టిపెట్టాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 30 రకాల విత్తనాలతో సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో జెడ్‌బీఎన్ఎఫ్ ప్రతినిధి ఎం.వరదానం, బొలగాని లక్ష్మి, సౌజన్య, ప్రవళిక పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: పోటుమెరక, గంగడిపాలెం, లంకెవానిదిబ్బ 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ డీఈఈ ఎస్.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

భట్టిప్రోలు మండలంలో

భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తునట్లు ఇన్‌చార్జ్ ఏఈ పి.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు

చుండూరు మండలంలో..

చుండూరు(వేమూరు): చుండూరు విద్యుత్ సబ్ స్టేషన్, యడ్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఇంజినీరు అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపల్లెలో..

రేపల్లె: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలోని తూర్పు హరిజనవాడ, రాజేష్ థియేటర్ ఏరియా, బీఎస్ఎన్ఎల్ సెంటర్, హౌసింగ్‌బోర్డ్ కాలనీలతో పాటు రాజశ్రీ వక్కపొడి కంపెనీ నుంచి కిసాన్‌నగర్ వరకు మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ టౌన్ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సచివాలయాల సేవలపై అవగాహన కల్పించాలి

జెడ్పీ సీఈఓ మోహన్‌రావు



మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించిన జెడ్పీ సీఈఓ మోహన్‌రావు చిత్రంలో ఎంపీపీ వనజ

కర్లపాలెం: గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న 540 సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు చెప్పారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు సచివాలయ సేవలపై అవగాహన పెంచుకుని ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంతో గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సచివాలయం సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. సంపద కేంద్రాల నిర్మాణం వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని చెప్పారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఆస్తులను గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి జెడ్పీ సీఈఓను కలిసి మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, ఎంపీడీఓ ఎ.ఎలీషా బాబు, ఫైజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కలం యోధుడు కోటంరాజు రామారావు

ఎమ్మెల్యే కోన రఘుపతి



పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే కోన రఘుపతి, రచయిత్రి డాక్టర్ భవానీదేవి తదితరులు

బాపట్ల: కలం యోధుడు కోటంరాజు రామారావు స్ఫూర్తిప్రదాత అని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, రచయిత, జర్నలిస్టు కోటంరాజు రామారావు చరిత్రను తెలియజేస్తూ ప్రముఖ రచయిత్రి డాక్టర్ చిల్లర భవానీదేవి రచించిన కలం యోధుడు కోటంరాజు రామారావు పుస్తకాన్ని బాపట్ల జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. బాపట్ల ఆర్ట్స్అండ్‌సైన్సు కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ డబ్ల్యూజీకే మూర్తి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ సమాజాభివృద్ధి కోసం కోటంరాజు రామారావు విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టరు పి.సి.సాయిబాబు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బి.ధనరాజ్, సురేష్, ఏడుకొండలరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

చెరుకుపల్లి: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.లక్ష్మీనారాయణ మూర్తి హెచ్చరించారు. వివిధ గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు శక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 44 బృందాలుగా ఏర్పడి 2,944 సర్వీసులను తనిఖీ చేశారు. 94 మంది అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్టు గుర్తించి రూ.3.18 లక్షలు అపరాధరుసుం విధించారు. అధికలోడు వినియోగిస్తున్న 77 సర్వీసులకు రూ.2.9 లక్షలు జరిమానా విధించారు. తుమ్మలపాలెం తదితర గ్రామాల్లో వేరు శనగ పైరుకు కొందరు విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు గుర్తించి వారికీ అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం మండలంలో విద్యుత్ బకాయిలు పెండింగ్ ఉన్న రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో బాపట్ల ఈఈ ఆంజనేయులు, స్థానిక డీఈఈ శ్యాంసుధాకర్, ఏఈ షేక్ అజహర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

వేమూరు: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ చోడయ్య కథనం ప్రకారం వేమూరు గ్రామానికి చెందిన కంచర్ల నాగరత్నం (70) ఇంటిలో ఒక్కటే ఉంటుంది. గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగింది. ఆమెను 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించినట్టు ఎస్ఐ తెలిపారు. ఆమెకు నలుగురు పిల్లలు ఉన్నారు. భర్త రెండు నెలల క్రితం మృతి చెందాడు. కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

పేదలకు న్యాయం చేయాలి

బాపట్ల: మండలంలోని మాదాల నారాయణస్వామి కాలనీలో నిరుపేదలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్ కోరారు. బాపట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. మాదాల నారాయణస్వామి కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు అవసరమైతే మాదాల నారాయణస్వామి కాలనీలో స్థలాన్ని కేటాయించాలని సూచించారు. అక్కడ నివసించే పేదలకు మరోచోట స్థలాలు ఇచ్చి పరిహారం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రంజాన్, డి.రాములమ్మ, లాజరు, పామంజి పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది బాలోత్సవ బ్రోచర్ ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: విద్యార్థులకు ఒత్తిడి లేని సమాజాన్ని నిర్మించేందుకు అందరం కలసి కృషి చేద్దామని కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్(క్యాబ్) అధ్యక్షులు బీఎస్ఆర్ మోహనరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని నవోదయ కాలనీలో శుక్రవారం ఉగాది బాలోత్సవం బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలోత్సవం నిర్వాహకులు కొట్టి కరుణాకరరావు, ప్రతినిధులు వై.సుబ్బారావు, రామచంద్రరావు, జగన్మోహనరావు, నాగరాజు, రియాజ్ బాషా, వి.వెంకటేష్ పాల్గొన్నారు.

12న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పోటీ పరీక్ష

చెరుకుపల్లి: ఢిల్లీ పబ్లిక్ ఇంటర్‌నేషనల్ స్కూల్ ఆర్గనైజేషన్ కోల్‌కతా ఆధ్వర్యంలో యూకేజీ నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ఈనెల 12న పోటీ పరీక్ష నిర్వహించనున్నట్టు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నేషనల్ పార్టనర్ పైనం ఏడుకొండల రెడ్డి తెలిపారు. ఈ పోటీ పరీక్ష బాపట్ల జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నట్టు వివరించారు. పాల్గొనదలచిన చిన్నారులకు ఎలాంటి రుసుమూ ఉండదని, ఈ పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని వెల్లడించారు. పరీక్ష పత్రాలను వెంటనే మూల్యాంకనం చేసి విజేతలకు ప్రథమ బహుమతిగా ల్యాప్‌ట్యాప్, ద్వితీయ బహుమతిగా ట్యాబ్, తృతీయ బహుమతిగా సెల్‌ఫోన్, గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్‌తోపాటు పాల్గొన్న ప్రతి విద్యార్థికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందిస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ : 9398476247, 7799797932 నంబర్లను సంప్రదించాలని సూచించారు.